కానరాని కందిపప్పు

- కూటమి పాలనలో కానరాని కందిపప్పు
- ఫిబ్రవరి నుంచి నిలిచిపోయిన సరఫరా
- రేషన్ సరకుల పంపిణీలో కోత
- పండుగ పూట ప్రత్యేక పంపిణీ కనుమరుగు



కపిలేశ్వరపురం: కూటమి పాలనలో పౌర సరఫరాల శాఖ ద్వారా పేదలకు అందజేసే నిత్యావసర సరుకులకు రానురానూ కోత పడుతోంది. ప్రచార ఆర్భాటాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడానికే ప్రభుత్వం ప్రధాన్యతనిస్తోంది. సక్రమంగానే ఉన్న రేషన్ కార్డులను మార్చి స్మార్ట్ పేరుతో కార్డులను మార్చి పంపిణీ చేస్తున్నారు. అందులోనూ తప్పులు దొర్లాయన్న ఆరోపణలున్నాయి. కార్డుల మార్పు ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఫిబ్రవరి నుంచి తొమ్మిది నెలలుగా కంది పప్పు సరఫరా చేయడం లేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఒకటో తేదీ వచ్చిందంటే కనీస మాత్రంగానైనా సరుకులు ఇస్తే పేద కుటుంబం నెలంతా ఎంతో కొంత ఆనందంతో గడుపుతుంది. పేదలకు కనీసం ఆహారాన్ని సరఫరా చేయడం ప్రభుత్వం బాధ్యత. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి నిత్యావసర సరుకుల పంపిణీలో కోత విధిస్తోంది.

గతంలో ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు

రాష్ట్రంలో 2021 జనవరి 21 న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఎండీయూ వాహనాలన్నీ క్షేత్రస్థాయికి చేరుకోగానే ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 12 పట్టణాల్లో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా 23న గ్రామాల్లో ప్రారంభమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం హయాంలో పేదలకు సరుకుల పంపిణీ దిగ్విజయంగా కొనసాగింది. మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 వాహనాల ద్వారా 85,894 కుటుంబాలకు సరుకులను పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాల ద్వారా 77,843 కుటుంబాలకు సరుకులు అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. అంతటి అద్భుతమైన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కంది పప్పును సరఫరా చేయలేని పరిస్థితిని తీసుకొచ్చింది.

కందిపప్పు ముట్టుకుంటే ఒట్టు

కనీసం దసరా, దీపావళి పండగల రోజుల్లోనైనా కందిపప్పును సరఫరా చేస్తారని పేద కుటుంబాల వారు ఆశించారు. జిల్లాలో 926 రేషన్ డీలర్లు పరిధిలో 5,39,120 కార్డుదారులకు నెలకు సుమారుగా 5.39.12 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం అవుతుందది ఒక అంచనా. పౌరసరఫరాల సంస్థ ద్వారా పేదలకు అందజేసే నిత్యావసర సరుకులు తగ్గిపోతున్నాయి. ఎప్పుడూ ఇచ్చే బియ్యంతోనే సరిపెడుతున్నారు. వాస్తవానికి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కందిపప్పు సరఫరా లేదు. ఎప్పటికప్పుడు ఈ సారి కందిపప్పు ఇస్తామంటూ కూటమి నేతలు ప్రచారం చేయడం తప్ప పేదలకు పంపిణీ చేసింది లేదు. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేసి ఉంటే 67 రూపాయలకు పేదలకు కిలో కందిపప్పు దక్కేది.

రెండు నియోజకవర్గాల్లో కార్డుదారులు

మండలం	షాపులు	కార్డులు
మండపేట	64	43,029
రాయవరం	41	21,059
కపిలేశ్వరపురం	42	21,806
రామచంద్రపురం	58	34,420
కె.గంగవరం	43	20,602
కాజులూరు	45	22,821
మొత్తం	293	1,63,737

కందిపప్పు పంపిణీపై దృష్టి సారించండి



సామాన్య కుటుంబాలకు బలవర్ధకమైన పోషక పదార్థం కందిపప్పు. కూటమి ప్రభుత్వం కందిపప్పు పంపిణీని నిలిపివేయడం తగదు. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలంటూ వైద్య, ఆరోగ్య కార్యకర్తలు ఒక పక్కన ప్రచారం చేస్తున్నారు. మరో పక్క రేషన్ సరుకుల్లో కందిపప్పు సరఫరా చేయడం లేదు.

– పాలింగి కృష్ణ కిశోర్, దళిత నేత, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

క్లుప్తంగా

ఈ మలుపు ప్రమాదాలకు పిలుపు



ఇటీవల మల్లవరం వంతెన వద్ద ఎదురెదురుగా ఢీకొన్న మోటారు సైకిళ్లు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల శివారు మల్లవరం వంతెన వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడం వల్ల నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మలుపు ప్రమాదకరంగా ఉండడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు లేకపోవడం మరోవైపు పక్కనే పంట కాలువ ఉండడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించని ప్రయాణికులు నిత్యం ఒకరినొకరు ఢీకొని గాయాల పాలవుతున్నారని చెబుతున్నారు. అధికారులు స్పందించి మల్లవరం వంతెన వద్ద ఉన్న మలుపులో హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పుష్కర ఘాట్లు



మసకపల్లిలో అధ్వానంగా మారిన పుష్కరఘాట్

కె.గంగవరం: మండలంలోని కూళ్ల నుంచి మసకపల్లి వరకు గౌతమి గోదావరి నది ఒడ్డున ఉన్న పుష్కర ఘాట్లు అధ్వానంగా మారాయి. ఇటీవల పలు మార్లు గౌతమి గోదావరి నదికి వచ్చిన వరద కారణంగా పుష్కరఘాట్లు అన్నీ చెత్తాచెదారం, బురదమయంగా ఉన్నాయి. ప్రతి రోజు ఆయా గ్రామాలకు చెందిన చెందిన భక్తులు పుష్కరఘాట్ల వద్ద గోదావరి స్నానం ఆచరిస్తారు. అయితే ఈ ఘాట్లు అధ్వానంగా ఉండడంతో పాటు ఘాట్ల వద్ద రాత్రుళ్లు అసాంఘిక కార్యక్రమాలు చేపడడం వల్ల అపరిశుభ్రంగా మారాయని స్థానికులు అంటున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని భక్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఘాట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి భక్తులకు సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారుల కార్యవర్గం ఎన్నిక



రెవెన్యూ ఉద్యోగుల సంఘం డివిజన్ నూతన కార్యవర్గం

రామచంద్రపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏపీఆర్ఎస్ఏ రామచంద్రపురం డివిజన్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడిగా రామచంద్రపురం తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామచంద్రపురం డీటీ మేడిశెట్టి హరిచంద్రవరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా ఒ.మురళీకృష్ణ, ఐ.సంధ్య, పి.రామారావు, సెక్రటరీగా బి.వెంకటభాస్కర్, జాయింట్ సెక్రటరీలుగా పి.అవతార్ మెహర్‌బాబా, పడాల సత్య రామప్రసాద్, బి.అర్జమ్మ, కోశాధికారిగా పి.శ్రీరాం ప్రసాద్, ఈసీ మెంబర్లుగా వి.దేవేందర్ కుమార్, సీహెచ్ సుజాత తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన రామచంద్రపురం డివిజన్ యూనిట్‌ను ఏపీఆర్ఎస్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

ఉద్యోగ మేళాలో 18 మంది ఎంపిక

రామచంద్రపురం: వారం వారం జాబ్ మేళాలో భాగంగా రామచంద్రపురంలోని శనివారం ఉపాధి కార్యాలయంలో జరిగిన ఉద్యోగ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారందరూ హోసూర్‌లో విధులు నిర్వహిస్తారని కంపెనీల ప్రతినిధులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు సునీల్, జయంత్ తదితరులు హాజరై ఉద్యోగానికి ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగం పొందిన 18 మంది మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, ఉపాధి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాపనమ్మ ఆలయంలో పూజలు

కపిలేశ్వరపురం (మండపేట): పాలతోడు గ్రామ దేవత బాపనమ్మవారిని శనివారం పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి దర్శించుకుని పూజలు చేశారు. ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సాదరంగా స్వాగతం పలికారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



సుధేష్ణదేవికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి నరసాపురానికి చెందిన కుడుపూడి సుధేష్ణదేవి రూ.15,111, మండలంలోని చింతనలంకకు చెందిన విల్లా మౌళి మణికుమార్‌లు రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



నల్లచెరువు వేంకటేశ్వరస్వామికి నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- దళితులను ప్రలోభాలకు గురిచేస్తున్న టీడీపీ నేతలు
- సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆరోపణ



వెంటూరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాయవరం: తెలుగుదేశం పార్టీలోకి వస్తావా లేదా రేషన్ డిపో లాగేసుకోమంటావా అంటూ ఆ పార్టీ నాయకులు దళితులను బెదిరిస్తూ ప్రలోభాలకు గురి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. వెంటూరులో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వైఎస్సార్ సీపీ దళితులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్టు వారు ఆరోపించారు. వైఎస్సార్ సీపీలో ఉన్న ప్రజాప్రతినిధులను బెదిరించి టీడీపీలోకి తీసుకోవడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. వి.సావరంలో రెండు, పసలపూడిలో ఒక రేషన్ డిపోలకు ప్రస్తుతం పనిచేస్తున్న దళిత రేషన్ డీలర్లను తొలగించారన్నారు. తమ మాట వినని రేషన్ షాపులపై అధికారులతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. వెంటూరు ఉప సర్పంచ్ నున్న ప్రదీప్‌కృష్ణను బెదిరించి పార్టీలోకి తీసుకున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను ఏదో విధంగా ఒత్తిడికి గురి చేసి వారికి టీడీపీ కండువాలు కప్పుతున్నారని అన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీకి ఉన్న అభిమానాన్ని, ఆదరాభిమానాలను చెక్కుచెదరనిదని వారన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కక్ష సాధింపు చర్యలు చేపడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, 16 నెలలు కాలంలోనే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందని వారన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, మండపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పాలిక శ్రీను, సోషల్ మీడియా మండల కన్వీనర్ తవిటికి రత్నకుమార్, పార్టీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, చాపల మట్టయ్య, రవ్వా వెంకట్రావు, చాపల అబ్రహాం, పార్టీ నేతలు పాల్గొన్నారు.

భీమరాజు సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం (మండపేట): రావులపేటకు చెందిన కాపు అభ్యుదయ సంఘం నాయకుడు గోకరకొండ భీమరాజు సేవలు ప్రశంసనీయమని ఆయన సంస్మరణ సభలో వక్తలు అన్నారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో శనివారం సంఘం అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా ఆధ్వర్యంలో భీమరాజు సంస్మరణ సభ నిర్వహించారు. సాయిబాబా మాట్లాడుతూ సంఘం నిర్మాణం, పటిష్టతకు భీమరాజు విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాళ్ళ శ్రీనివాస్, వల్రే సత్యనారాయణ, కురసాల సత్యనారాయణ, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



సిరిపురపు శ్రీనివాసరావు

రాయవరం: పేద ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం ఆటలాడుకుంటోందని, వైద్యపరంగా ప్రజలకు కలిగే ఇబ్బందులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు విమర్శించారు. రాయవరంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు పూనుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. పేదల జీవితాలతో ఆటలాడుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రతిపాడు నియోజకవర్గం రౌతులపూడిలో సినీ దర్శక, నిర్మాత, హీరో ఆర్.నారాయణమూర్తి వంటి వ్యక్తి ఆస్పత్రి నిర్మించి ప్రభుత్వానికి అప్పగిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి వైద్య కళాశాలలను తీసుకుని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేట్ పరం చేయడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలి



జి.సరేష్

ఆలమూరు: నేటి సమకాలీన సమాజంలో సాంకేతిక అభివృద్ధి చెందుతున్న విధంగానే రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ఎస్సై జి.నరేష్ సూచించారు. ఆలమూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబర్ నేరాలు–తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొరియర్ల పేరుతో ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. అలాగే చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతోను, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తరహా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే సత్వరమే 1930 నంబరు డయల్ చేసి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల వాట్సాప్ వేదికగా ఏపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమంటూ ఫోన్‌కాల్స్ వస్తున్నాయని సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

కల్యాణ మండపం అభివృద్ధికి రూ.20 లక్షల మంజూరు



కల్యాణ మండపం పనులు ప్రారంభించిన ఎంపీ బోస్

రామచంద్రపురం: మండలంలోని అన్నాయిపేట గ్రామంలోని కాపు కల్యాణ మండప నిర్మాణ పనులకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కల్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ బోస్ రూ.20 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబి, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు పెమ్మిరెడ్డి దొరబాబు, యల్లమిల్లి సతీష్‌కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, నాయకులు గాదంశెట్టి శ్రీధర్, నరాల ఏడుకొండలు, చల్లా బుజ్జి, కాకిలేటి సూరిబాబు, పోలిశెట్టి కృష్ణ, నక్కా భీమశంకర తదితరులు పాల్గొన్నారు

నకిలీ మద్యాన్ని నిరసిస్తూ రేపు ఆందోళన



తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వ పాలనలో విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలను నిరసిస్తూ 13న సోమవారం నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయం నుంచి బయలు దేరి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ తోట తెలిపారు.

కొరిపెల్లకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



కపిలేశ్వరపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, కపిలేశ్వరపురానికి చెందిన కొరిపెల్ల సుబ్బారావు మాతృమూర్తి సుందరమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ పరామర్శించారు. పరామర్శించినవారిలో కట్టా మురళి, పిప్పర సంపతరావు, బొక్కా రాంబాబు, వంగా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి కృషి



అంగర సహకార సంఘం వద్ద చేనేత కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కపిలేశ్వరపురం: చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం బకాయిలను చెల్లించే విషయమై ఈ నెలాఖరు నాటికి ఓ పరిష్కారాన్ని చూపుతానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార సంఘం సభ్యులు తమకు రావలసిన రూ.3.85 కోట్ల వివిధ రకాల బకాయిలను చెల్లించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 14వ రోజుకు చేరుకుంది. మంత్రి సుభాష్ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. చేనేత కార్మికులతో చర్చించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక శాఖ నుంచి నిధులను సమకూర్చి సీఎం చంద్రబాబుతో చర్చించి బకాయిలను విడుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మగ్గం నేత కార్మిక కుటుంబానికి ఏడాదికి రూ.25 వేలు ఇస్తామన్న హామీని డిసెంబర్ ఆఖరు నాటికి అమలు చేస్తామన్నారు. మంత్రి హామీ మేరకు తాము రిలే నిరాహార దీక్షను విరమిస్తున్నామని, హామీ అమలు కోసం ఎదురు చూస్తామని చేనేత కార్మికులు తెలిపారు.

నూతన జీఎస్టీపై మంత్రి ఇంటింటా ప్రచారం

రామచంద్రపురం రూరల్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని వెలంపాలెంలో శనివారం కూటమి పార్టీ నాయకులతో కలిసి సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటా ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు, వ్యాపారులు వద్దకు వెళ్లి అవగాహన కల్పించి, జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి వారికి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంపై పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

పోరాట స్ఫూర్తి.. ఉద్యమ దీప్తి

- తోరాటి లక్ష్మణమూర్తి జీవితం ఆదర్శనీయం
- అంగరలో ఉదయించి.. వికారాబాద్‌లో అస్తమించి
- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మృతి
- 13న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 99వ జయంత్యుత్సవం



అంగరలో కామ్రేడ్ లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం



కాకినాడ పోర్టు ప్రాంతంలో లక్ష్మణమూర్తి స్మారక స్థూపం

కపిలేశ్వరపురం: ప్రజలే శ్వాసగా బతికిన అతికొద్ది మందిలో అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి ఒకరు. తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలకులు, రజాకారులు ఆధీనంలో ఉన్న భూములను పేదలకు పంచేందుకు ఆయన ఉద్యమకారులతో కలిసి వీరోచిత పోరాటం సాగించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోలీసుల తూటాలకు 23 ఏళ్ల వయస్సులో లక్ష్మణమూర్తి అమరుడయ్యాడు. ఆయన 99వ జయంతిని స్వగ్రామం అంగరలో 13న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జమీందారీ వ్యతిరేక పోరాటాల్లో..

చిన్న వయస్సులోనే ప్రజా సమస్యలను అధ్యయనం చేయడం వాటి పరిష్కారానికి ప్రజలను జాగృతం చేయడాన్ని లక్ష్మణమూర్తి తన జీవన విధానంగా మార్చుకున్నాడు. రామచంద్రపురం తాలూకు పరిసర గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాల్లో కీలకంగా వ్యవహరించడంతో ఆయన కార్యకలాపాలను నిలువరించేందుకు అప్పట్లో అంగర ప్రధాన రహదారి పక్కన పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆ ఔట్‌పోస్టు నేటి పోలీస్ స్టేషన్. స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో పేద రైతులకు భూములను పంచాలంటూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం ప్రారంభం కావడంతో అంగర నుంచి లక్ష్మణమూర్తి అక్కడికి వెళ్లి ఓ ప్రాంతానికి నాయకత్వం వహించారు. సరిగ్గా పోరాటం ముగించిన రోజైన 1951 అక్టోబర్ 21న వికారాబాద్ ప్రాంతంలో రైతుల నుద్దేశించి ప్రసంగిస్తుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆయన అసువులు బాసారు. భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేత, సాయుధ పోరాట రథసారధి పుచ్చలపల్లి సుందరయ్య తాను రాసిన వీర తెలంగాణ విప్లవ పోరాటం –కొన్ని గుణపాఠాలు అనే గ్రంథం 3వ అధ్యాయంలో వికారాబాద్ అనే చాప్టర్‌లో లక్ష్మణమూర్తి త్యాగాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అంగరలో తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్మించారు. లక్ష్మణమూర్తి నిలువెత్తు విగ్రహాన్ని అంగర గాంధీ సెంటర్‌లో, స్మారక స్తూపాన్ని మండపేట కరాచీ సెంటర్, కాకినాడ పోర్టులో ఏర్పాటు చేశారు.



తోరాటి లక్ష్మణమూర్తి చిత్రం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంస్మరణ కార్యక్రమాలు



తోరాటి లక్ష్మణమూర్తి వంటి పోరాట యోధుల జీవితాలకు స్ఫూర్తి పొంది అనేక మంది ప్రజా ఉద్యమాల్లోకి వచ్చారు. ఆయన జీవితం ఓ ప్రాంతానికి పరిమితం కాదు. యావత్ శ్రామిక జనావళితో మిళితమైనది. ఆయన స్ఫూర్తికి చిహ్నంగా కాకినాడ పోర్టు ప్రాంతంలో స్మారక చిహ్నం నిర్మించారు. ఇటీవల పోర్టు రైల్వే ఉద్యోగులు దానిని ఆధునీకరించారు.

– చింతపల్లి అజయ్‌కుమార్, సీఐటీయూ కార్మిక సంఘం నాయకుడు, కాకినాడ